# నేచెప్పానుగా!

అంతా మనలాగే ఉంటారా! మన మేమో మర్యాదగా మంచిగా మౌనంగా ఉంటాం. మన అభిప్రాయం అడిగితే చెప్తాం. అదీ చెప్పవలసివస్తేనే చెప్తాం. అందరూ ఇలా వుండరు. మామూలుగా ప్రవర్తించరు. అడిగినా, అడక్కపోయినా అభిప్రాయాలు వెలిబుచ్చుతారు; ప్రకటనలు చేస్తారు; ఉద్దేశాలు ఉద్ఘాటించుతారు. పిలవని పేరంటానికి వెళ్ళిపోతూ వుంటారు. అవసరంలేని విషయాల్లో అర్జెంటుగా జోక్యం కలిగించుకుంటారు. వీళ్ళంతా ఉద్దండపిండాలు, మహామహులు, ప్రముఖవ్యక్తులు.

వీళ్ళలోకూడా రకాలవారీ మనుష్యులున్నారు. పూరా గొప్పవాళ్ళు, సగంగొప్పవాళ్ళు, లోకం వప్పుకున్నా తమమీద తమకు నమ్మకం లేనివాళ్ళు, లోకం అంగీకరించకపోయినా తనమీద తమకి మాచెడ్డ నమ్మకమున్నవాళ్లు వగైరా వగైరా ఎందరో మహానుభావులు. ఈ గొప్పవాళ్లు తమ గొప్పవైన నోళ్లు తెరవగానే వాళ్ళు ఏరకం గొప్పవాళ్ళో మనం పోల్చుకోవచ్చు. వీళ్ళకి సూత్రప్రాయమైన ఊతపదాలు ఉంటాయి. తమ అమూల్యమైన అభిప్రాయ ప్రకటనలో మొదటో, మధ్యనో, కొసనో సదరు ఊతపదాలని వాడుతారు. ఆ ఊతపదాలు ఏమిటయ్యా అంటే–'నన్నడిగితే, నా కెందుకులే, టైంలేదు, ఏదో ఫరవా

లేదు, నే చెప్పానుగా. ఈ అయిదున్నూ గొప్పవాళ్ళ ఊత పదాలవేళ్లు.

ఈ ఊతపదాలనుబట్టి వాళ్లు వాళ్ళ గొప్పతనంయొక్క పవరెంతో అచియెలా పోల్చుకోడమో చెప్తా. హోమియోపతీ మాత్రలు చూడటానికి అన్నీ ఒకలాగే వుంటాయి. అలాగే ఈ మహానుభావులు కూడా తేడా పాడాలులేనట్టు కనబడతారు. సదరు హోమియోపతి మాత్రలలో ఎక్కువల తేడా ఉన్నట్టే ఈ ప్రముఖుల వాక్కులలో కూడా బోలెడంత తేడా వుంది. నన్నడిగితే_అనేవాళ్ళను తీసుకోండి. వీళ్ళు కొద్దిగా నాకెందుకులే అనేవాళ్ళలాగే కనబడతారు. గాని నన్నడిగితే అనేవాళ్లు తమ అభిప్రాయాలకు బాధ్యత వహించరు. నన్నడిగితే అనే వాళ్లు తమ మనసులోని భావాలని బయటికి చెప్పేసి ఆ తరు వాత కనబడరు, కనబడ్డా మాట్లాడరు. మళ్ళా మాట్లాడినా నన్నడిగితే అనే ఇంకో సంగతి చెబుతారు. టైంలేదు అనే వాళ్లు నిజంగా నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరిగేవాళ్లు. వీళ్ళకి ఎప్పుడూ టైంవుంటూనే ఉంటుంది. అదిలేదని బయటకి చెప్పడంలోనే ఆ టైమంతా వృథాచేస్తారు. అయినా వాళ్లు గొప్పవాళ్ళే. ఇక ఫరవాలేదు అనేవాళ్లు అందరికన్నా గొప్ప వాళ్ళలాగ కనబడతారు నారదు డొచ్చి పాడినా వీళ్ళకి ఓ మోస్తరుగానే వినబడుతుంది. ఫరవాలేదు పనికొస్తాడు అంటారు. రంభ నాట్యమాడినా, మయుడు అద్భుత విచిత్ర శాలలు నిర్మించినా ఫరవాలేదు అనేవాళ్ళకి ఓ మోస్తరుగానే వుంటాయి. వీళ్ళకి తృప్తిఅన్నది లేదు. పెరఫెక్షన్ అన్నది వీళ్ళ పరమావధిగా కనబడుతుంది గాని, అదికూడా వీళ్ళకి

సరిపోదు. అందుచేత, నేను మనవిచేసిన ప్రముఖులలో అగ్ర తాంబూలం వీరికే ఇవ్వాల్సి వుంటుందేమో అనిపించవచ్చు. గానీ, అందరికన్నా గొప్పవాళ్లు నే చెప్పానుగా అనేవాళ్లు. వీళ్లు ఒకరకంగా చూస్తే నన్నడిగితే, టైంలేదు, ఫరవాలేదు అనే మన స్తత్వాల కలగలుపు. వీళ్లు ఏ విషయానికైనా మొట్టమొదట కట్టకడ ప్రకటన బడుతూ ఉంటారు.

వీళ్లు రామాస్వస్తి, రావణాస్వస్తిగాళ్లు. ఏ ఎండ కా గొడుగు పట్టేస్తారు. జాగిలాలతో వేటాడుతారు. కుందేళ్ళతో పరుగెడుతారు. మందార మకరంద మాధుర్యమున దేలు మధుపమ్ము పోవునే మరోచోటుకి. అందుచేత వీళ్ళు ఎటు గెలుపుంటే అటే చేరుతారు. ఆ సంగతి తమకు తొలి దగ్గిర నుంచి తెలిసినట్టే నటిస్తారు. అది నటన అని తెలియనివ్వక పోవడంలోనే ఉంది వాళ్ళ ప్రాముఖ్యం.

ఇది బొత్తిగా మరీ కలికాలం. కాబట్టి నే చెప్పానుగా అనేవాళ్ళు ఊసరవిల్లిలాగ, తైరుకొట్టువాళ్ళలాగ, పెద్ద మనుష్యులలాగ, చెడ్డవాళ్ళలాగ మనకు కనబడతారు గాని, కృతయుగంనుంచీ ఇలాంటివాళ్లు లేకపోలేదు. సత్యకాలపు రోజుల్లో సత్యకాలపు మనుషులలోకూడా ఈ నేచెప్పానుగా అనేవాళ్లు ఉన్నారు.

మాటవరసకి వశిష్ఠుణ్నే తీసుకోండి. ఈ గురుదేవుడు హరిశ్చంద్రుడు అష్టకష్టాలు పడ్డాక అంతిమవిజయం సాధించాక చక్కావచ్చి నే చెప్పానుగా హరిశ్చంద్రుడు అబద్ధం ఆడడు అని చెప్తాడు. నిజమే. ఈయన ముందే చెప్పాడు. బాగానే వుంది. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ప్రత్యక్షమైనప్పుడే

ఈయనా ప్రత్యక్షమై హరిశ్చంద్రుడుగారు అమాంతంగా అర్ధాంగలక్ష్మి తలకొట్టేసే సమయానికే, ఆ ఘట్టాన్ని నాటకంగా చూస్తున్న ఆడియన్సుల కన్నీళ్ళతో జేబురుమాళ్ళు తడిచేసిన వేళకే ఈయన సరిగ్గా దిగబడి ఏమయ్యా విశ్వామిత్రుడా, నేను చెప్పలేదూ అంటే ఎలా ఉంటుంది చెప్పండి. మాటామాటావచ్చి, వాళ్ళూ వాళ్ళూ పోటీలుపడి మధ్య నొకణ్ణి ఇలా బాధపెడతారూ! పెట్టేరు. మనమేం చేస్తాం? ఆ నాటకం ఆడుతున్నప్పుడల్లా స్నేహితులతోపాటు చూడటానికి వెళ్తాం. చూస్తాం. చూస్తున్నంతసేపూ మన ప్రక్కనకూర్చున్న మిత్రరత్నం నే చెప్పలేదూ – ఈ ఘట్టంలో ఫలానా యాక్టరు ఫలానా రాగంలో పాడతాడనీ అంటూ మనచెవి కొరుకుతూంటే అదికూడా సహిస్తాం.

దేవతలలోనూ, దేవత్వం వున్నవాళ్ళలోనే కాదు – రాక్షసులలోనూ నే చెప్పానుగా అనేవాళ్ళు పూర్వంనుంచీ వున్నారు. ఓరే మాయలేడి వేషంవేసుకొని రాముణ్ణి మరపింతాలు పెట్టరా అని రావణాసురుడు మారీచుడితో చెప్పాడు. ఒద్దురా స్వాములారి వేషంవేసుకొని రాముడి భార్యజోలికి పోకు అని మారీచుడు ఎంతో చెప్పాడు. రావణాసురుడు వినలేదు. చచ్చిపోయినవాళ్ళ లోకంలో మారీచుడు రావణాసురుణ్ణి కలుసుకున్నాక నోరు తెరిచి చెప్పిన మొదటి మాటలు నే చెప్పానుగా అనేవే అయి వుంటాయి.

వీళ్ళందరూ ఒక ఎత్తు, శ్రీకృష్ణుడు ఒక ఎత్తు. అత డంత పొలిటీషియన్ ఇంకొకడులేడు. అనవసరంగా నారదుణ్ణి కలహప్రియు డంటారుగాని, ఆదినుంచీ ఆ శ్రీకృష్ణపర

మాత్ముడు వీళ్ళకీ వాళ్ళకీ ముడిపెట్టి ఆనందించేవాడు. పై పెచ్చు చివర్న నే చెప్పానుగా అంటాడు. మాయముని వేషం వేసుకుని అర్జున్ణ్ణి కొండమీద ముక్కుమూసుకొని కూర్చోమన్నవాడూ ఆయనే – బలరాముడు ఆ మాయముని సపర్యలకి సుభద్రని నియమిస్తున్నప్పుడు జాగ్రత్త అన్నయ్యా, ఏం మునుగుతుందో? అని వార్నింగ్ ఇచ్చినవాడూ ఆయనే – సుభద్రనిచ్చి పెళ్ళిచేసి అర్జున్ణ్ణి ఎత్తుకుపొమ్మని చెప్పి చూశావా అన్నయ్యా, నేను ఆనాడే చెప్పానుగా అన్నవాడూ ఆయనే – నే చెప్పానుగా అనే ప్రముఖులకి ఆదిపురుషుడు ఈ దివ్యపురుషుడే.

బలరాముడు కనబడ్డప్పుడల్లా శ్రీకృష్ణుడు నే చెప్పానుగా అనేటట్టే మనకు కనబడుతుంది. పాండవులతరఫున కౌరవ సభకి రాయబారం వెళ్ళాడు. అక్కడ చెప్పవలసినవన్నీ చెప్పాడు. జెండాపై కపిరాజు మొదలైన పద్యాలు చదువుతాడు. సంతోషంబున సంధిచేయ నుంటాడు. కౌరవులు వింటారా? కాళ్ళూ చేతులూ కట్టేయబోయి కయ్యానికి కాలు దువ్వారు. యుద్ధమైంది. చచ్చిరి సోదరుల్ సుతుల్ చచ్చిరి. దుర్యోధనుడు మడుగులో దూరి జల స్తంభన కావించాడు. ఎత్తిపొడుపులుపొడిచి రాజరాజుని బైటికిలాగుతానని భీముడు ముందుకొచ్చాడు. అబ్బాయ్! నువ్వుకాదు వీరా అన్నయ్య ధర్మరాజు ఎత్తిపొడిస్తేనే బయటకొస్తాడని చెప్పి కృష్ణుడు చతురంభోధిపరీతమైన ధరణీచక్రంబు శాసించి– అనే పద్యాలు చదివేస్తాడు. దుర్యోధనుడు. బయటికొచ్చి గదా

యుద్ధానికి తలపడ్డప్పుడు బలరాముడువచ్చి తమ్ముడిని తిడతాడు.

సంధి గావింపకుండువే చతురుపాయ
ముల నెఱింగిన బుద్ధికౌశలము గలవు
ఉత్తవైరంబు బెంచితి క్షితి నేల
ధరించి సుఖించునే ధర్మరాజు?

అని బలరాముడనగానే, కృష్ణుడు నే ముందే చెప్పానుగా, అంటూ అన్నయ్యా నామీద లేని యపవాదుమోపిన నే నేమందును? అర్థమున్నది, మొగమున్నది. దుర్యోధనునే యడుగరాదా! అయిదూళ్ళిచ్చిన పాండవులకు చాలునని నే బతిమాలితినో లేదో—అని చల్లగా చెప్తాడు.

అది ద్వాపరయుగం కాబట్టి, ఎంతచెడ్డా ధర్మం రెండు కాళ్ళమీదనైనా నడిచేది కాబట్టి మొట్టమొదట ఫలానా రకంగా జరుగుతుందని చెప్పి కట్టకడపట నే చెప్పానుగా అనే వారు అలా అనడం బాగానేవుంది. ఇప్పుడు ఘోరకలి వొండి పోతున్నది కాబట్టి ముందు ఏమీ సెలవియ్యకుండానే అన్నీ అమర్చినదాంట్లో అ తెగారు వేలుపెట్టినట్లు ప్రముఖులు ఆఖరు ఘట్టంలో హారజయి నే చెప్పానుగా అని తయారవుతారు.

మనుష్యు లెందు కిలా అంటూవుంటారన్న విషయం కొంచెం ఆలోచించవలసిందే. పర్యవసానంకోసం ఈషన్మాత్రం పాటుపడకుండా, ఫలితం తేలిన వేళలో పక్షిలాగ రెక్కలు

కట్టుకోనివాలి; ఆ ఫలితమంతా తమ ప్రయోజకత్వమే అని భావుకొందామనుకోవడంలోనే నే చెప్పానుగా అనే జబ్బుకి పునాది వుంది. పరాన్నభుక్కుతనం పెరిగినకొద్దీ ఈ జబ్బు వింత వింత రూపాలు ధరించడానికి వీలుచిక్కింది. రాతిగొడ్డలి రాతిక చేసుకోనడంలోనూ, చేతులారా తిండి సంపాదించుకోనడంలోనూ, సతమతమయ్యే ఆదిమానవుడు ఎప్పుడూ నేను చెప్పానుగాఅనిఉండడు. చాతుర్వర్ణాలు ఏర్పడ్డాక కొందరికి తీరుబాటుదొరికాక పర్యవసానంనిమిత్తంపాటుపడకుండాఫలితాలు జుర్రుకోనడం మొదలయిన దగ్గర్నుంచి ఈ నే చెప్పానుగా అని గొప్పలు చెప్పుకోనడం ప్రారంభం అయిందని నా ఉద్దేశం.

పొలంనుంచి పంటవస్తే కాలుమీద కాలువేసుకుని కబుర్లు చెప్పే మహానుభావులు ఎంతకైనా తగినవాళ్ళే. రాంభజన మందిరం ఆవరణలోనో, రచ్చబండమీదో కూర్చుని వీళ్ళు మాట్లాడేటప్పుడు గంటసేపు సాగే సంభాషణలో కనీసం అరడజనుసార్లయినా నే చెప్పానుగా అనే మాట మనకి వినబడక తప్పదు.

గొప్పలు చెప్పుకోనడం మెప్పుసంపాదించడం మానవ నైజమే అనుకోండి. దమ్మిడీయెత్తు పనిచెయ్యకుండా పల్లెత్తు మాటసాయం చెయ్యకుండా మెప్పుకొట్టేద్దా మనుకునేవాళ్లే ఇలా బయటపడిపోతూ ఉంటారు. నిజంగా చెప్పినవాడు బయటికి చెప్పనే చెప్పడు. అతడిదగ్గరికే చెప్పించుకోన్న వాడు వెళ్ళి బాబూ మీరు చెప్పారండీ గాని అని మొదలెడతాడు. ఆ చెప్పిన ఆయన మొహమాటపడి పోనిద్దూఅంటాడు.

అలా అనడంచేత, ప్రచారం కోరుకోనక పోవడంవల్ల అతడు సాధారణవ్యక్తిగా ఉండిపోతాడు. స్వంతబాజా రెండుచేతులా వాయించుకొనేవాడు ఎండుతాటాకు మండుటాను మంటలాగ నిముషంలో ప్రముఖుడై పోతాడు. మంట చల్లారినా మాటలు చెప్పడం మరచిపోలేడు. ఇవాళ గురువారం అని మీరన్నా రనుకోండి. ఈ సంగతి నేను నిన్ననే చెప్పానుగా అని తడుము కోకుండా చెప్పేస్తాడు—ఈ రోజు గురువారం కావడానికి తానే కారణం అయినట్టు మనల్ని భావించమంటాడు.

ఇలాంటివాళ్ళని చూశాక త్యాగరాజస్వామి పాడినట్టు ఎందరో మహానుభావులు అందరికీ వందనములు అని ఒక్కదండం పెట్టాలనిపిస్తుంది. గానీ, నన్నడిగితే, నాకు తెలుసు, ఫరవాలేదు, టైంలేదు, నేను చెప్పానుగా అనే ప్రముఖులందరూ కళ్ళముందు నిలబడగానే అందరూ మహానుభావులు, ఎందరికని వందనాలు అని విసుగెత్తి మానేస్తాం.